క్లుప్తంగా

ఎంపీకి మద్దతు ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ప్రభుగౌడ్

సంగారెడ్డి: మెదక్ ఎంపీ స్థానం కోసం మద్దతు ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర నాయకులు ప్రభుగౌడ్ కోరారు. శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు ప్రభుగౌడ్ చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జగ్గసింగ్, మక్సూద్ అలి, సుధాకర్ గౌడ్, ఎండీ ఖాన్ మెఫి, వైద్యనాథ్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీలో ఆకస్మిక తనిఖీ

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ శనివారం మున్సిపల్ పరిధిలో ఆకస్మిక తనిఖీ చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు తనిఖీ నిర్వహించారు. పలు ప్రధాన కూడళ్ల వద్ద పారిశుద్ధ్య పనులు, ఇంటింటికీ తిరిగి ఆటోల్లో చెత్త సేకరణ తీరును పరిశీలించారు. అలాగే శానిటరీ అధికారి శ్రీనివాస్‌కు పారిశుద్ధ్య విషయంలో పలు సూచనలిచ్చారు.

లగ్గెరి అడివయ్య గుండెపోటుతో మృతి

కోహీర్(జహీరాబాద్): లగ్గెరి అడివయ్య (75) గుండెపోటుతో మరణించాడు. స్వాతంత్ర్య, గణతంత్ర, రాష్ట్ర ఆవతరణ దినోత్సవం ఇలా ఏదైనా పట్టణంలో జెండా ఆవిష్కరణ సందర్భంగా జాతీయ గీతాలాపన తరువాత బోలో భారత్ మాతాకీ జై అంటూ నినాదం చేసే వ్యక్తిగా అతను సుపరిచితుడు. విషయానికొస్తే.. వారం రోజులుగా హైదరాబాద్‌లోని ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. పట్టణంలోని పట్లూర్ బేస్ నివాసి అయిన ఆయన పంచాయతీ వార్డు సభ్యులుగా, సీడీసీ డైరెక్టర్‌గా, రాచన్నస్వామి ఆలయం పాలక మండలి సభ్యులుగా సేవలు అందించారు. సమాజ సేవా సమితి సభ్యులుగా వేలాది కిలోమీటర్లు పాదయాత్రలు నిర్వహించి జాతీయ సమైక్యతకు పాటు పడ్డారు. రంగ స్థల కళాకారుడిగా, భజన సంకీర్తన పరుడిగా, మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషిగా మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకొన్నారు. ఆయన అంత్యక్రియలు సాయంత్రం కోహీర్ శ్మశాన వాటికలో జరిగాయి.

ఆర్టీసీ బస్సులో మంటలు

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ఓవర్‌లోడ్‌తో ఒక్కసారిగా టైర్ల నుంచి పొగలు వ్యాపించి మంటలు ఎగిసిపడ్డాయి. శనివారం సాయంత్రం మెదక్ నుంచి సంగారెడ్డి డిపోకు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామం వద్దకు రాగానే బస్సు టైర్ల నుంచి పొగలు వచ్చాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురై దిగిపోయారు. ఓవర్ లోడ్ కారణంగానే టైర్ల నుంచి పొగలు వచ్చాయని స్థానికులు తెలిపారు. ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

వ్యక్తి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వ్యక్తి అదృశ్యమైన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్‌లో నివాసముండే వి.దత్తు ప్రవేట్ సంస్థలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. గత నెల 29వ తేదీన ఫోన్, బైక్‌ను ఇంట్లోనే పెట్టి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం రామచంద్రాపురం పట్టణంలోని ఆయన నివాసంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

'జహీరాబాద్ ఎంపీగా అవకాశం ఇవ్వండి'

జోగిపేట(అందోల్): జహీరాబాద్ లోక్‌సభకు తన పేరును కూడా పరిశీలించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ భర్త మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో తన్నీరు హరీశ్‌రావును శనివారం హైదరాబాద్‌లో కలిసి కోరారు. ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీలో ఆశావాహులు బయటకు వస్తున్నారు. సీఎం కేసీఆర్ గత మూడు మాసాల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ ఎమ్మెల్సీ లేదా జహీరాబాద్ ఎంపీ టికెట్టు విషయమై కోరగా సానుకూలంగా స్పందించినట్లుగా అప్పట్లో ప్రచారం జరిగింది.

ఆకట్టుకుంటున్న హస్త కళ





చేనేత మేళాలో ప్రదర్శిస్తున్న వస్తువులు

సంగారెడ్డి: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి చేనేత హస్త కళా మేళా పట్టణ ప్రజలను ఆకట్టుకుంటోంది. పట్టణంలోని టీటీడీలో ఏర్పాటు చేసిన దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ కాల చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచారు. పోచంపల్లి నారాయణపేట, గద్వాల, వరంగల్, ఉప్పాడ, కంచి, ధర్మవరం, సిద్దిపేట, వెంకటగిరి చీరలు, కాటన్ చీరలు, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, టవల్స్, కాటన్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, కర్టెన్లు, ఖాదీ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయి. హస్త కళ వస్తువులైన కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్ బొమ్మలు, మైసూర్ రోజ్‌వుడ్ వస్తువులు, వరంగల్ లెదర్స్, బంజారా ఎంబ్రాయిడరీ హైదరాబాద్ పెరల్స్, హైదరాబాద్ బ్యాంగిల్స్, చెక్క వస్తువులు, బ్లాక్ మెటల్స్, పెంబర్తి, ఇత్తడి వస్తువులు, ఖాదీ గ్రామోద్యోగ్, హెర్బల్ ఉత్పత్తులు, మైసూర్ అగర్బత్తి, బెంగాలీ జూట్ బ్యాగులను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. అయితే మేళాను చూసేందుకు ప్రజలు తరలిరావడంతో కిటకిటలాడుతోంది. వస్తువులను కొనేందుకు మహిళలు, యువత సుముఖత చూపుతున్నారు.

పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి

కంగ్టి(నారాయణఖేడ్): పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని మండల వైద్యాధికారి నాగమణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్ల లోపు ఉన్న తమ పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో పిల్లలకు చుక్కలు వేయించడానికి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బాధ్యత వహించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలు, తండాల్లో పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు 50 శిబిరాలు ఏర్పాటు చేసినట్లు, టీంతో పాటు తడకల్, కంగ్టి బస్టాండ్‌ల్లో మొబైల్ టీంలను ఏర్పాటు చేసి చుక్కల మందు వేయిస్తున్నట్లు తెలిపారు.

మునిపల్లి(అందోల్): పల్స్ పోలియో చుక్కల మందు 0–5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ వేయాలని సిబ్బందికి మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సంధ్య సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 3,582 మంది పిల్లలున్నారని, 34 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, బస్టాండ్లు, పిల్లలున్న ప్రాంతాల్లో పల్స్ పోలియో చుక్కల మందు వేయడం జరుగుతుందన్నారు.

బస్‌పాస్ మేళాకు స్పందన



వివరాలను నమోదు చేసుకున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగుల బస్ పాస్ మేళాకు స్పందన వచ్చినట్లు టీఎస్ఆర్టీసీ హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 108 మంది దివ్యాంగులకు బస్ పాస్‌లు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్‌పాస్ ఏటీఎం నిర్వాకుడు మహేశ్‌కుమార్, సీఐలు ప్రశాంత్ కుమార్, ధనుంజయ్ ఆర్టీసీ సిబ్బంది మధు, ఉదయ్ కుమార్ , బాసప్ప, మహేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం 6 గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించిన నేపథ్యంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ బీరంగూడ శివాలయం చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ మున్నా , మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల రమేశ్ యాదవ్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, చేనేత విభాగం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి రమేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం రామచంద్రాపురం పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ వస్తే రిజర్వేషన్లు రద్దు ఖాయం

కేవీపీఎస్ రాష్ట్ర నేత స్కైలాబ్‌బాబు

సంగారెడ్డి అర్బన్: మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అన్నారు. శనివారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించడం ద్వారా రిజర్వేషన్లను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతూ కులాల మధ్య కుంపటి రాజేసి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. మతోన్మాదాన్ని అడ్డుకొని రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. దళితులపై 300రెట్లు దాడులు దౌర్జన్యాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు, న్యాయవాది కె.సుభాస్, మద్దూరి శివకుమార్, బి.ప్రవీణ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పనిచేసిన కూలీలకే హాజరు వేయాలి

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకే హాజరు వేయాలని పనిచేయని వారికి హాజరు వేయడంతో చేసిన వారికి నష్టం జరుగుతుందని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. శనివారం మండలంలోని భీమ్రా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల హాజరు తీసుకున్నారు. మొత్తం 164 మంది కూలీలు పనులకు హాజరైనట్లు తెలిపారు. వచ్చే వారంలో నిర్వహించే పనులకు సంబంధించి వర్క్ డిమాండ్ సైతం స్వీకరించారు. రాతి కట్టల నిర్మాణం, వరద కాల్వల తవ్వకం పనులు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ నర్సింలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభలో తహసీల్దార్ విష్ణుసాగర్

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో శనివారం ధరణి భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహించారు. ఈనెల 9వ తేదీ వరకు ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఉన్నందున రైతులు తమ పట్టా పాస్ బుక్‌ల్లో, ఆన్‌లైన్‌లో తలెత్తుతున్న సమస్యలను అధికారులకు దరఖాస్తు చేసుకొని పరిష్కరించుకోవాలని తహసీల్దార్ విష్ణుసాగర్ తెలిపారు. మండలంలోని బాన్సువాడలో సభలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తులు స్వీకరించారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు

వట్‌పల్లి(అందోల్): మట్టిని అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శంబిరెడ్డి హెచ్చరించారు. శనివారం వట్‌పల్లి శివారు నుంచి మట్టి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి రాగా మట్టిని తరలిస్తున్నవారు పారిపోయారు. ఈ సందర్భంగా సాక్షితో మాట్లాడుతూ సెలవుదినాల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో వాల్టా చట్టానికి విరుద్ధంగా మట్టి తరలించరాదన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

తహసీల్దార్ ఫర్హీన్ షేక్



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న తహసీల్దార్ ఫర్హీన్ షేక్

హత్నూర (సంగారెడ్డి): భూ సమస్యల పరిష్కారం కోసం ధరణిలో పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫర్హీన్ షేక్ శనివారం తెలిపారు. మండలంలో మూడు టీములు పనిచేస్తున్నాయని, 9వ తేదీ వరకు అన్ని గ్రామాలలో విచారణ జరిపి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా పనిచేస్తున్నామని చెప్పారు. రెండు రోజులుగా సుమారు 3వందల దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించామని తెలిపారు. అర్జీదారులు గ్రామ సభలకు హాజరై సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు సహకరించాలని తహసీల్దార్ కోరారు.

నిర్విరామంగా అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ప్రణాళికా బద్ధంగా నిధులు కేటాయిస్తూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రూ.1.63 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, వరద నీటి పైపులైను నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వస్తుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న లలిత కుమారి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా వెల్ఫేర్ అధికారిణి కే.లలిత కుమారి అన్నారు. శనివారం రాత్రి తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్ కాలనీలో కౌన్సిలర్ సరితా శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అరుణ్ గౌడ్, తూర్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుటుందని వివరించారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలను పెంచుతున్నామని తెలిపారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆటో నుంచి ఆకాశం వరకు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పావని, మంజుల, మయూరి రాజుగౌడ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి చక్రస్నానం



ఆలయంలో మహిళా భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మహీంద్ర పస్తాపూర్.. వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల చివరి రోజైన శనివారం చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు నరసింహా చార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సుప్రభాత సేవ, తీర్థ ప్రసాద గోష్టి, ధ్వజారోహణం, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. చక్రస్నానం క్రతువు ముగిసిన తరువాత ఆరాధన, పుష్పయాగం, పవళింపు సేవా కార్యక్రమాలను జరిపారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం పఠించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. దీంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సెక్రటరీ సంగారెడ్డి, సభ్యులు రాజేష్, వీరస్వామి, జీఎస్ నాయుడు, చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కాంట్రాక్టర్ వేధింపులు ఆపాలి

మెడికల్ యూనియన్ నాయకుడు యాదగిరి

సంగారెడ్డి: వేతనాల గురించి అడిగినందుకు ముగ్గురు కార్మికులను తొలగించడాన్ని ఖండిస్తూ కార్మికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం దారుణం అన్నారు. కాంట్రాక్టర్ వేధింపులు తట్టుకోలేక ఆ ముగ్గురు కార్మికులు ఆత్మహత్యా ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు కారణమైన కాంట్రాక్టు ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరి, శోభ, రమాదేవి, మరియమ్మ, హలీమా, నిఖిత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వివాహిత అదృశ్యం**

పటాన్‌చెరుటౌన్: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని పీజేఆర్ ఎంక్లేవ్‌కు చెందిన శ్రీనివాస్ వాచ్‌మెన్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఫిబ్రవరి 21 తేదీన శ్రీనివాస్ భార్య అనిత కర్ణాటకలోని సాయమ్మ దేవాలయానికి వెళ్లొస్తానని చెప్పడంతో భార్యను చందానగర్ రైల్వే స్టేషన్ లో శ్రీనివాస్ వదిలివచ్చాడు. 27వ తేదీ వరకు ఫోన్ లో మాట్లాడింది. తర్వాతి రోజు నుంచి స్పందించకపోవడంతో తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య అదృశ్యంపై శనివారం శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

◆ **రెండు ఉద్యోగాలకు యువకుడి ఎంపిక**

నారాయణఖేడ్: మండలంలోని కొండాపూర్ పంచాయతి పరిధిలోని మిత్యానాయక్ తండాకు చెందిన యువకుడు రాథోడ్ విజయ్ కుమార్ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. బీఎడ్, ఆంగ్లంలో పీజీ పూర్తి చేసి సెట్‌లో క్వాలిఫైడ్ అయిన ఈయన మల్టిజోన్‌లో జూనియర్ లెక్చరర్ (ఆంగ్లం), జోన్ పరిధిలో టీజీటీ (ఆంగ్లం) ఉద్యోగాలకు ఎంపికయ్యాడు.

◆ **ఘనంగా శివాలయ ప్రారంభోత్సవం**

నారాయణఖేడ్: మండలంలోని పోతన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయం ప్రారంభోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, పురోహితుల ఆధ్వర్యంలో హోమంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అంతర్గాం పాండురంగ రుక్మిణి ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి తదితరులు హాజరు కాగా వారిని నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు, శివదీక్షాదారులుపాల్గొన్నారు.

◆ **ఏఆర్టీ సెంటర్లో ఉన్నతాధికారుల విచారణ**

సంగారెడ్డి: తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉన్నతాధికారులు జిల్లా ఆస్పత్రిలో విచారణ చేపట్టినట్టు సమాచారం. కొన్ని రోజులుగా ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్, సిబ్బందికి మధ్య జరుగుతున్న గొడవలు, పరస్పర ఫిర్యాదులపై శనివారం ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ బోర్డ్ డైరెక్టర్ కరుణశ్రీ, ఏపీడీ ప్రసాద్‌తో కలిసి ఆసుపత్రిలో విచారించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె చెప్పినట్టు తెలిసింది.

◆ **సీసీ రోడ్డు పనుల ప్రారంభం**

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జోషి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు మాణయ్య, చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, అభిలాష్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

◆ **అన్ని రంగాల్లో రాణించాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద అన్నారు. శనివారం తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాసా కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ రమణ, సభ్యులు కవిత, రామ్మూర్తి, రవిరమణ, వాలంటరీ షర్మిల పాల్గొన్నారు.

◆ **గీతం స్కాలర్ తనూజకు పీహెచ్‌డీ**

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని అన్నా తనూజ సఫాలాను డాక్టరేట్ వరించింది. 'బయోమాక్రో మోలిక్యూల్స్ తో బెంజిమిడాజోల్ కంజెనర్ల పరస్పర చర్యపై సమగ్ర బయోఫిజికల్, సిద్ధాంతక అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేతన్ సాహు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించారు.

◆ **సభ విజయవంతం చేయాలి**

పటాన్‌చెరు టౌన్: ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. శనివారం అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడ ఎల్లంకి కళాశాలలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి బీజేపీ ఆలిండియా ఆర్గనైజేషన్ సెక్రటరీ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మార్చి 5వ తేదీన జరిగే ప్రధాని సభ పై చర్చించారు.

◆ **సృజనాత్మకతను వెలికి తీయడానికే.. వైజ్ఞానిక ప్రదర్శనలు**

పటాన్‌చెరు టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని త్రివేణి స్కూల్ అసిస్టెంట్ సెంట్రల్ రిసోర్స్ ఆఫీసర్ సతీష్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలోని త్రివేణి హైస్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో త్రివేణి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫర్జానా, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

◆ **పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం**

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని లింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని మాజీ సర్పంచ్ చర్ల లక్ష్మి ఓఆర్ఆర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చర్ల మణిదీప్, పాఠశాల చైర్మన్ అదా శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

◆ **మంచి మార్కులు సాధించాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని ఈదుల నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోచయ్య అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందించేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్‌రాములు గౌడ్ కుమారుడు సాయిచరణ్ గౌడ్ ముందుకు రావడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్, శ్రీనివాస్ రాథోడ్, అనిత రెడ్డి, పవన్ రాజ్, నాయక్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400